సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం, 19, ఫిబ్రవరి, 2023



శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఎంపీ సోయం పూజలు



పూజలకు ముస్తాబైన సంజయ్ నగర్ శివాలయంలోని శివలింగం



గంగపుత్ర శివాలయం వద్ద బారులు తీరిన భక్తజనం

పాహిమాం.. పరమేశ్వరా

- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- జిల్లాలో ఘనంగా మహాశివరాత్రి



మహాకాల్ శోభాయాత్రలో పరమశివుని ప్రతిమ

ఆదిలాబాద్: హరహరమహాదేవ..శంభో శంకర.. పాహిమాం.. పాహిమాం.. అంటూ శివనామ స్మరణతో జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ముక్కంటి దర్శనార్థం భక్తులు శనివారం వేకువజాము నుంచే ఆలయాలకు తరలి వచ్చారు. భోళా శంకరున్ని బిల్వదళాలతో అర్చించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, మహా గణపతి పూజ, మహాహారతితో పాటు శివపార్వతుల కల్యాణ మహోత్సవం వంటి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయం, ఉమామహేశ్వర ఆలయం, మల్లికార్జునస్వామి ఆలయం, సంజయ్‌నగర్ శివాలయం, గంగపుత్ర శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. మాఘ మాసంలోని శనివారంను విశిష్టమైందిగా భక్తులు భావిస్తారు. అందులోనూ మహాశివరాత్రి శని త్రయోదశి కలిసి రావడంతో స్థానిక శనీశ్వర ఆలయానికి పోటెత్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి.



గంగపుత్ర శివాలయంలో పూజలు



శివలింగాన్ని అభిషేకిస్తున్న మహిళలు

ప్రముఖుల ప్రత్యేక పూజలు

జిల్లా కేంద్రంలోని శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఎంపీ సోయం బాపూరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. పట్టణంలోని గంగపుత్ర శివాలయం, సంజయ్‌నగర్ శివాలయాల్లో మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్, తదితరులు పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు.



ఉత్సాహంతో డోలు వాయిస్తున్న యువతి

ఆకట్టుకున్న 'మహాకాల్' శోభాయాత్ర

ఆదిలాబాద్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మహాకాల్ సేన వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర చేపట్టారు. ఎమ్మెల్యే జోగు రామన్న యాత్రను ప్రారంభించగా.. పట్టణంలోని పలు వీధులగుండా గంగపుత్ర శివాలయం వరకు కొనసాగింది. మహారాష్ట్ర డోలు తాశా నృత్య బృందాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మహాకాల్ సేన అధ్యక్షుడు మహాకాల్ అజయ్, మున్సిపల్ కౌన్సిలర్ పవన్ నాయక్, యువత పాల్గొన్నారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు



హారతి తీసుకుంటున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న, స్థానిక ప్రజాప్రతినిధులు

న్యూస్‌రీల్

24న ఉపాధ్యాయులకు సదరం శిబిరం

ఎదులాపురం: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న శారీరక వైకల్యం గల ఉపాధ్యాయులకు ఈ నెల 24న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు సదరం ధ్రువీకరణ పత్రం రెన్యూవల్, నూతన ధ్రువీకరణ పత్రం అవసరమైన వారు మీసేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకుని శిబిరానికి హాజరు కావాలని సూచించారు. స్లాట్ బుకింగ్ సమాచారాన్ని డీఈవో కార్యాలయంలో తెలియజేయాలని, విషయాన్ని పీహెచ్ ఉపాధ్యాయులు గమనించాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం: దివ్యాంగుల ఉపాధి నిమిత్తం పునరావాస పథకం కింద 2022–23 సంవత్సరానికి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి మిల్కా ప్రకటనలో తెలిపారు. పథకంలో భాగంగా వ్యవసాయ, అనుబంధ పరిశ్రమలు, సేవారంగంలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 28వరకు https:// tsobmms. cgg. gov. in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'పరిహారం తగ్గించి రైతులకు అన్యాయం చేస్తారా..'



దీక్షకు మద్దతు తెలుపుతున్న సుహాసినిరెడ్డి

తాంసి: పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న భూములకు గతంలో ఇస్తామన్న పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం రైతులను నష్టపోయే విధంగా చేస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి ఆరోపించారు. పరిహారం కోసం రైతులు చేపట్టిన రిలే దీక్షలు ,నాలుగో రోజుకు చేరాయి. ఈమేరకు దీక్ష శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించి మద్దతు తెలిపారు. రైతులకు మార్కెట్ రేటు ప్రకారం త్వరగా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, ప్రవీణ్‌రెడ్డి, సుభాష్, పోచ్చన్న, నందు తదితరులు ఉన్నారు. అలాగే దీక్షలకు భీంపూర్ వైస్‌ఎంపీపీ లస్మన్న మద్దతు తెలిపారు.

బసవేశ్వరుడి మార్గం అనుసరణీయం



విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: బసవేశ్వరుడు చూపిన మార్గం అనుసరణీయమని తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమన్వయ సమితి అధ్యక్షుడు ముస్తాపురే అశోక్ అన్నారు. మహా శివరాత్రి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని బసవేశ్వర చౌక్‌లో బసవేశ్వరుని విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. బసవేశ్వరుడు కులరహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, పవన్‌రావ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, శ్రీనివాస్, జగదీశ్వర్, బద్రీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకాశవాణిలో 'ముచ్చట'

ఎదులాపురం: ఆకాశవాణిలో 'ఇల్లు–ఎవుసం' కార్యక్రమంలో భాగంగా నిమ్మ, బత్తాయి తోటల్లో సస్యరక్షణ చర్యలపై ఆదిలాబాద్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజాగౌడ్‌తో ముచ్చట కార్యక్రమం ఉంటుందని ప్రోగ్రాం హెడ్ రామేశ్వర్ కేంద్రే ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రసారమవుతుందని పేర్కొన్నారు. శ్రోతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పనికి వెళ్తేనే 'ఉపాధి'

- 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ'లో సంస్కరణలు
- ఇన్‌యాక్టివ్ జాబ్‌కార్డుల ఏరివేతకు కేంద్రం కసరత్తు
- అక్రమాలకు చెక్ పెట్టేలా చర్యలు

జిల్లాలోని పంచాయతీలు	468
జారీ చేసిన జాబ్‌కార్డులు	171548
నమోదైన ఉపాధి కూలీలు	3,61,062
యాక్టివ్ జాబ్‌కార్డులు	1,13,945
ఇన్‌యాక్టివ్ జాబ్‌కార్డులు	57,603



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు వంద రోజుల ఉపాధి కల్పించాలనే సదుద్దేశంతో చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమల్లో కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. అక్రమాలకు అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపడుతోంది. ఇటీవల ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లోనూ ఉపాధి హామీ కేటాయింపుల్లో కోత విధించింది. పనిచేసే వారికి మాత్రమే ఉపాధి కల్పిస్తూ ఇన్‌యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులన్నింటినీ రద్దు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన కసరత్తు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లావ్యాప్తంగా 50వేలకు పైబడి ఇన్‌యాక్టివ్ జాబ్‌కార్డులు రద్దుకానున్నాయి.

పనిచేసే వారికే 'ఉపాధి'

క్షేత్రస్థాయిలో పనికి హాజరయ్యే వారికి మాత్రమే ఇక నుంచి ఉపాధి హామీ దక్కనుంది. అయితే ఇప్పటివరకు పనులకు హాజరు కాకున్నా క్షేత్రసహాయకులు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో హాజరు నమోదు చేసుకుని కొందరు కూలి పొందుతున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు గాను ఇటీవల ప్రతీ జాబ్‌కార్డును ఆధార్‌తో అనుసంధానం చేశారు. దీంతో బోగస్‌కార్డులకు చెక్ పడనుంది. జిల్లాలో 3 లక్షల మందికి పైగా కూలీలు జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 2,25,577 మంది మాత్రమే రెగ్యులర్‌గా పనికి వెళుతున్నారు. మరో 1,35,485 మంది పనులకు వెళ్లడం లేదు. జాబ్ కార్డు పొందినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరోజు పనులకు వెళ్లనటువంటి దాన్ని ప్రామాణికంగా తీసుకుని ఆయా కార్డులను రద్దు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో జిల్లాలో సుమారు లక్ష మందికి కూలీలకుపైగా ప్రభావం చూపే అవకాశముంది. మరో 41 రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. కాగా ఇప్పటి వరకు జిల్లాలో కేవలం 263 కుటుంబాలు మాత్రమే వంద రోజుల పని పూర్తి చేసుకున్నాయి.

కరోనా వేళ పెరిగిన కార్డులు

కరోనా వ్యాప్తితో 2020–21 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో జాబ్‌కార్డుల సంఖ్య భారీగా పెరిగింది. వైరస్ విజృంభణతో ఇతర దేశాలు, నగరాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన వారంతా తిరిగి గ్రామాల బాట పట్టారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే వారితో పాటు చదువుకునే విద్యార్థులు సైతం స్వగ్రామాలకు వచ్చారు. వీరంతా కోవిడ్ సమయంలో ఉపాధి పనులకు వెళ్లారు. దీంతో జాబ్‌కార్డుల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. ప్రస్తుతం కరోనా తగ్గడంతో అలాంటి వారంతా తిరిగి పట్టణాలకు చేరారు. వారి జాబ్ కార్డులు వృథాగా మారాయి. అలాగే పశువుల పాకలు, కల్లాలు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు సైతం జాబ్‌కార్డులను తప్పనిసరి చేశారు. ప్రస్తుతం వాటి నిర్మాణాలు పూర్తికావడంతో ఇలాంటి జాబ్‌కార్డులు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. కొంత మంది వద్ద రెండేసి కార్డులున్నాయి. ఆధార్ అనుసంధానంతో ఇలాంటివి తొలగిపోనున్నాయి. తాజాగా ఇన్‌యాక్టివ్ కార్డుల రద్దుతో జిల్లాలో పనులకు వచ్చే వారికి పక్కాగా ఉపాధి లభించే అవకాశముంది. అక్రమంగా కూలి పొందే వారికి మాత్రం ఈ నిర్ణయంతో చెక్‌పడనుంది. అయితే కూలీలు రెండు పూటలా పనిచేయాలని, ఉదయం, సాయంత్రం రెండు సార్లు ఫొటోతో కూడిన హాజరు నమోదు చేస్తుండటంతో కూలీల సంఖ్య తగ్గనుందనే అభిప్రాయం అధికారికవర్గాల్లో వ్యక్తమవుతుంది.

దళితుల భూముల్లో బోరుబావులు

- మౌలిక వసతులు కల్పించి సాగులోకి తెచ్చేలా చర్యలు
- తొలిదశలో 24.. రెండో దశలో 375 బోరుబావులు
- సర్వే బాధ్యతలు భూగర్భ జలశాఖకు..

ఆదిలాబాద్‌రూరల్: దళితులకు గతంలో సర్కారు పంపిణీ చేసిన వ్యవసాయ భూములకు నీటి వసతి కల్పించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సాగుకు యోగ్యం లేని వాటికి మౌలిక వసతులు కల్పించి సాగులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతోంది. నీటి జాడ సర్వే బాధ్యతలను భూగర్భ జలశాఖకు అప్పగించింది. వారు ఇచ్చే నివేదికల ఆధారంగా బావులు తవ్వించడంతో పాటు మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించనుంది. జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో 24 బోరు బావులు తవ్వించగా..రెండో దశలో 375 వరకు తవ్వించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఇప్పటికే 220 బోరుబావులు డ్రిల్ చేశారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ 2022–23 ఏడాదికి గాను 8,814 ఎకరాలకు పైగా సాగునీటి వసతి కల్పించడానికి ప్రణాళికలు రూపొందించింది.

ఇప్పటి వరకు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 1,883 మంది దళితులకు దళితబస్తీ పథకం కింద 8,814 ఎకరాల వ్యవసాయ భూమిని పంపిణీ చేసి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఇందుకోసం రూ. 207 కోట్లు ఖర్చు చేసింది. వీటికి సాగునీటి వసతి కల్పించేందుకు 2014–2022 వరకు 732 ఎకరాల్లో 244 బోరుబావులు తవ్వించారు. విద్యుత్ సౌకర్యం కల్పనకు రూ. 2.18 కోట్లు వెచ్చించారు. దళితులను ఉన్నతస్థాయికి తీసుకురావడానికి ప్రభుత్వం పెట్టుబడి సాయం సైతం అందజేస్తోంది. ఒక్కో రైతుకు బోరుబావి తవ్వకం, మోటారు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు.

కోట్లాది రూపాయలు ఖర్చు

భూ పంపిణీ కోసం ప్రభుత్వం గతంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. చాలా చోట్ల ప్రభుత్వ భూములున్నా సాగుకు పనికిరావనే ఉద్దేశంతో పట్టాదారుల వద్ద కొనుగోలు చేశారు. కొన్ని చోట్ల ఒక్కో బోరు తవ్వించి ముగ్గురు లబ్ధి దారులకు నీటి వసతి కల్పించారు. ఇప్పుడు అలాగే అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భూగర్భజలశాఖ ఇచ్చే నివేదిక ప్రకారం ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.



బోరుబావుల కోసం ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి దరఖాస్తు అందజేస్తున్న దళిత రైతులు

భూముల్లో మౌలిక వసతులు

ప్రభుత్వం గతంలో దళితులకు పంపిణీ చేసిన అసైన్డ్ వ్యవసాయ భూముల్లో మౌలిక వసతులు కల్పించనున్నారు. సాగుకు యోగ్యం లేని వాటిని సాగులోకి తీసుకువచ్చేందుకు చదును చేయడం, చెరువు మట్టి వేయించడం వంటి పనులు చేపట్టనున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద, ఒకవేళ ఈ పథకం వర్తించకపోతే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములను అభివృద్ధి చేయనున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లోనే కాకుండా దళితుల సొంత భూముల్లో సైతం అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తున్నాం

దళితులకు పంపిణీ చేసిన భూముల్లో సాగునీటి సౌకర్యం కల్పించనున్నాం. వాటికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తున్నాం. జిల్లాలో 375 మంది దళిత రైతుల వ్యవసాయ భూముల్లో బోరుబావులు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే 244 మంది రైతుల వ్యవసాయ పొలాల్లో బోరుబావులు వేశాం. త్వరలో మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించనున్నాం.

– శంకర్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీరాంపూర్: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రగతిమైదానంలో 41వ నేషనల్ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మైదానంలో సందడి నెలకొంది. శనివారం పోటీలను గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్సార్పీ 3గని మేనేజర్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. రెండ్రోజులుగా లీగ్‌మ్యాచ్‌లు సాగుతున్నాయి. మొత్తం 35పాయింట్లకు లీగ్ మ్యాచ్ ఉంటుంది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఆర్.నారాయణరెడ్డి, జాయింట్ సెక్రెటరీ గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లీగ్ మ్యాచ్‌ల విజేతలు వీరే..

బాలురలో ..: మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, తమిళనాడు, ఒడిశా, హర్యానా, పశ్చిమబంగాల్, కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు విజేతలుగా నిలిచాయి.

బాలికల్లో...

మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, పాండిచ్చేరి, తెలంగాణ, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, బిహార్, గుజరాత్ జట్లు విజయం సాధించాయి.



తలపడుతున్న తెలంగాణ, కర్ణాటక జట్లు

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల విజేత ఉమ్మడి ఆదిలాబాద్



విజేతగా నిలిచిన జట్టు

ఆదిలాబాద్: ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్ విద్యుత్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజయం సాధించింది. హైదరాబాద్ విజయానంద్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన టి 20 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 136 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు 19.3 ఓవర్లలో 137 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 28 జట్లు పాల్గొన్నాయి. విజేతలను ఆ శాఖ ఎస్ఈ వాసుదేవ్, ఆదిలాబాద్ ఎస్ఈ సంపత్‌కుమార్, నిర్మల్ ఎస్ఈ చౌహాన్, మంచిర్యాల ఎస్ఈ శేషారావు, కాగజ్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రాజశేఖర్ అభినందించారు.

జాతీయ స్థాయి పోటీల్లో కాంస్యం


కోచ్ రాజుతో డెంజిల్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన ఎస్. డెంజిల్ అనే విద్యార్థి జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాడు. తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ - కెడెట్ జాతీయ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి, పార్థసారధి, జూడో కోచ్ రాజు అభినందించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కష్టపడి చదువాలని ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఐటీడీఏ కార్యాలయంలో జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన గురుకుల కళాశాలల విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని గురుకుల కళాశాలల నుంచి 40మంది విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కు అర్హత సాధించడం గొప్ప విషయమని తెలిపారు. గురుకులం ఉమ్మడి జిల్లా ఉపసంచాలకులు గంగాధర్, స్టార్-50 సమన్వయ కర్త మారుతి శర్మ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఉన్నారు.


కథాగానం చేస్తున్న కాత్లే లక్ష్మణ్ బృందం

సండే స్పెషల్

కథకారులు

- ప్రాచీన ఒగ్గుకథకు జీవం
- పల్లెపదాలకు విశేష ఆదరణ

సాక్షి, మంచిర్యాలడెస్క్: జానపద కళారూపాల్లో ఒగ్గుకథకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇది గానం, నృత్యం, నాటిక మిశ్రమంగా సాగుతుంది. కథలు.. పురాణాలు.. ఎన్నో చరిత్రలను కళ్లకు కట్టినట్లుగా.. వినసొంపుగా ఉంటూ శ్రోతలను కట్టిపడేస్తుంది. ఒగ్గుకథ కళాకారులు ఒక్కొక్కరు పదుల సంఖ్యలో కథలను అవలీలగా చెప్పేస్తారు. కళాపోషణను ప్రాణప్రదంగా భావిస్తూ.. వారసత్వంగా వచ్చిన కళను కాపాడుకుంటూ.. భావితరాలకు అందిస్తూ.. కథను బతికించాలనే ప్రయత్నం చేస్తూ.. ఒగ్గుకథకు విశేష ఖ్యాతిని ఆర్జిస్తూ ముందుకు సాగుతున్నారు.

కళాకారుల ఊరు


ఒగ్గు కథ చెబుతున్న గుంటి శ్రీశైలం బృందం

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోనంపేట కళాకారులు ప్రాచీనమైన ఒగ్గుకథకు జీవం పోస్తున్నారు. కోనంపేట ఒగ్గుకళకు పెట్టింది పేరు. ఏనుగుల శంకర్, గుంటి శ్రీశైలం, తిరుపతి, ఏనుగుల రమేష్ బృందాలు ఒగ్గుకథ ప్రదర్శనలో రాణిస్తున్నాయి. ఒగ్గు కళాకారులు చెప్పే కథలకు పల్లెజనం మంత్రముగ్ధులవుతారు. పెద్దమనిషి గుంటి బీరయ్య వందేళ్ల క్రితమే ఒగ్గుకు ఉగ్గు పోశాడు. ఆయన వారసత్వంగా గ్రామంలోని దాదాపు 80మంది గొల్లకుర్మ యువకులు కళాకారులుగా ఎదిగారు. ఏనుగుల శంకర్‌కు ఒగ్గుకథ సోగ్గాడనే పేరొచ్చింది. ఆయన కథకు పల్లె జనం మంత్రముగ్ధులు అవుతారు. ప్రదర్శన ఉందంటే చాలు గ్రామాల్లో సందడి నెలకొంటుంది. నిరక్షరాస్యుడైన శంకర్ వందల కథలను పుక్కిట పట్టి చిన్నతనం నుంచి జనాన్ని తన గాత్రంతో ఉర్రూతలూగిస్తున్నాడు. తన తాత గుంటి మల్లయ్య ద్వారా కథలను శంకర్ ఒంట పట్టించుకున్నాడు. మల్లన్న కథ, ఎల్లమ్మ, నల్లపోచమ్మ, గిరిజావతి, ఆయిళ్ల బీరప్ప, జయలక్ష్మీ, పెద్దిరాజు, పెద్దమ్మ కథ, శ్రీదేవి, ఐదు మల్లెపూల కథలు ప్రసిద్ధిగాంచాయి. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వందల ప్రదర్శనలు ఇచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పకళారామంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారాధనలో ఒగ్గు కళారూపాన్ని ప్రదర్శించారు. రవీంద్రభారతి సంచాలకులు మామిడి హరికృష్ణ కథకుడు శ్రీశైలంను అభినందించి ప్రశంసపత్రం అందజేశారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ప్రదర్శనతో భక్తులను అలరింపజేయగా సత్యసాయిబాబా మెచ్చుకొని కోనంపేట కళాకారులను ఆశీర్వదించారు.

వేషధారణలో కర్రె రమేశ్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ప్రాచీన కళ జానపద కళలకు ఒకప్పుడు మంచి గుర్తింపు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నానాటికీ ఆదరణ తగ్గడంతో కళాకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ కళలనే నమ్మి జీవనోపాధి పొందుతున్నాం. మాలాంటి కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. అప్పుడే సంప్రదాయ కళలను కాపాడవచ్చు.

– ఏనుగుల శంకర్, ఒగ్గు బృందం నాయకుడు

సంప్రదాయాన్ని కాపాడుకుందాం



పాశ్చాత్య ధోరణి అనుసరిస్తూ బంగారంలాంటి ప్రాచీన కళలను మనమే మరుగున పడేస్తున్నాం. ఒగ్గు కథ తాతల కాలం నుంచి మాకు వారసత్వంగా వస్తుంది. ఈ ప్రాచీన కళ అంతరించిపోకుండా ఉండేందుకు కృషి చేయాలి. దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన వారి వద్ద శిక్షణలు తీసుకున్నాం. అందుకే కష్టపడి విద్య నేర్చుకున్నాం. మా ఒగ్గు కళను కాపాడుకుంటాం.

– గుంటి శ్రీశైలం, ఒగ్గు బృందం నాయకుడు

సినిమాల్లోనూ..



మంచిర్యాల జిల్లా భీమిని మండలం వీగాం గ్రామానికి చెందిన పోలె పోశాలు, కర్రె రమేష్ బృందాలు ఒగ్గుకథలతో ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో బృందంలో ఆరుగురు చొప్పున కళాకారులు ఉన్నారు. మల్లన్న ఒగ్గుకథ, వీరన్న, పోచమ్మ, పెద్దిరాజు, పెద్దమ్మ, అరబంతి పూబంతి ఇలా 20కి పైగా కథలు చెబుతారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. రమేష్ నర్తన వికాస్ అవార్డు అందుకున్నారు. వీరి ప్రదర్శనలను తిలకించిన మంత్రి హరీశ్‌రావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి కృష్ణ, మాజీ ఎంపీ వివేక్, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రశంసించారు. సినిమాల్లోనూ ఒగ్గుకథ ప్రదర్శనలు ఇచ్చారు. – కర్రె రమేశ్, భీమిని

కళను నమ్ముకుని..

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం చించోలి గ్రామానికి చెందిన కాత్లే లక్ష్మణ్ బృందం కథాగానాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తోంది. బృందంలో ఐదుగురు కళాకారులు ఉన్నారు. ఇప్పటివరకు వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. తమ కళను చాటుకోవడానికి వంశపారంపర్యంగా చెబుతూ వస్తున్నారు. కుటుంబ సభ్యులకు కథలపై శిక్షణ ఇస్తున్నారు. సుమారు వంద వరకు కథలు చెప్పగలుగుతారు. 2016 ఆగస్టు 15న తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రశంసపత్రం అందజేసింది. 2016 గిరి ఉత్సవ్‌లో ఐటీడీఏ ఉట్నూర్‌లో ప్రశంసపత్రం అందుకున్నారు. 2018 ఆగస్టు 31న హైదరాబాద్‌లో జరిగిన జానపద జాతర, తెలంగాణ బహుముఖ సకల సమ్మేళనం, నెహ్రూ యువ కేంద్రం ఆదిలాబాద్‌లో ప్రశంసపత్రాలు అందుకున్నారు.

ఆదుకోవాలి..



గత 30సంవత్సరాలుగా ఈ వృత్తిలో కొనసాగుతున్నాను. ప్రభుత్వం మా వృత్తిని గుర్తించి కళాకారులను ఆదుకోవాలి. ఈ తరంలో నేర్చుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఆనవాయితీ, కళను కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులకు నేర్పిస్తున్నాం.

– కాత్లే లక్ష్మణ్

ఇల్లు మంజూరు చేయాలి



మా కుటుంబ సభ్యులం బృందంలో కలిసి వెళ్తుంటాం. ఇప్పటివరకు ఉండడానికి ఇల్లు సైతం లేదు. గుడిసెలోనే జీవనం గడుపుతున్నాం. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలి. – రాధాబాయి

కళాకారులను గుర్తించాలి



వివిధ ప్రాంతాల్లో మా బృందంతో కలిసి కథాగానం వినిపిస్తున్నాం. దీన్ని ప్రభుత్వం గుర్తించి కళాకారులను ప్రోత్సహిస్తే బాగుంటుంది. మా కుటుంబ సభ్యులకు మాత్రమే నేర్పిస్తున్నాం. దీనిపై ఎక్కువగా ఎవరు శ్రద్ధ చూపడం లేదు. – తిరుపతి

వందేళ్ల వారసత్వం..!


రేడియో కేంద్రంలో ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

కుమురంభీం జిల్లా కౌటాల మండలం శీర్ష గ్రామంలో 30మంది ఒగ్గు కథ, ఒగ్గుడోలు కళాకారులు ఉన్నారు. వారసత్వంగా ఒగ్గుకథను ఒక తరం నుంచి మరో తరానికి అందిస్తున్నారు. వందేళ్లకు పైగా కథ ప్రస్థానం కొనసాగుతోంది. పోలే రాజులు బృందంలో పది మంది ఉన్నారు. ఇప్పటివరకు వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. మల్లన్న బండారి ఒగ్గుకథ, గొల్లకేతమ్మ, రత్నంగి, మెడలంబ, పెద్దిరాజు, గిరిజవతి, గంగదేవి, పార్వతి కల్యాణం, పోచమ్మ, బీరయ్య, ఎల్లమ్మ ఒగ్గుకథ ఇలా 20కి పైగా కథలు అలవోకగా చెప్పగలుగుతారు. ఆర్థికంగా ప్రయోజనం లేకున్నా తమ కళను చాటుకోవడానికి ప్రదర్శనలు ఇస్తూ వారసత్వం కొనసాగిస్తున్నారు.

అవార్డులు, ప్రశంసలు

ఇప్పటివరకు రాష్ట్ర మంత్రులు, కలెక్టర్, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేల నుంచి ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. 2019లో ఢిల్లీలో డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. ఇతర కార్యక్రమాల్లోనూ పలు అవార్డులు అందుకున్నారు.

తాతల కాలం నుంచి.



మా తాతల కాలం నుంచి వందేళ్లకు పైగా ఒగ్గు కథ చెబుతున్నాం. ప్రభుత్వ, ఇతర కార్యక్రమాల్లో ఇప్పటివరకు చాలా కథలు చెప్పాం. ఈ వృత్తితో ఆర్థికంగా ప్రయోజనం లేకపోయినా కళను చాటడానికి చెబుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు మా కథలు విని ప్రశంసించినప్పుడు సంతోషం వేస్తుంది.

– పోలె రాజులు, కళాకారుడు, గ్రామం: శీర్ష

కళను నమ్ముకున్నాం..



మా పూర్వీకులు మాకు నేర్పిన కళను నమ్ముకుని జీవిస్తున్నాం. ప్రస్తుతం యువత ఒగ్గుకథలు నేర్చుకోవడానికి అంతగా ఆసక్తి చూపడంలేదు. ఇటీవల మా గ్రామంలో 15మంది యువకులకు ఒగ్గుడోలు శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వం ఒగ్గు డోలు కళాకారులను ఆదుకోవాలి.

– సైళ్ల పోశయ్య, కళాకారుడు, గ్రామం: శీర్ష

పూర్వీకుల నుంచి..


శివశంకర ఒగ్గు కళాబృందం సభ్యులు

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన శివశంకర ఒగ్గు కళా బృందం తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఒగ్గుకథ కళను నమ్ముకుని జీవనం సాగిస్తోంది. ప్రధాన కథకుడు ఎగుర్ల రాములు తన 18వ ఏట నుంచే తండ్రి మల్లయ్య ద్వారా ఒగ్గు కథ నేర్చుకుని కథలు చెబుతున్నాడు. ఈయన బృందంలో 18మంది కళాకారులు ఉన్నారు. ప్రదర్శనను బట్టి కళాకారులు పాల్గొంటారు. మల్లన్న కథ(మల్లికార్జున), పోచమ్మ, శంకరుడు, గంగాదేవి, ఎల్లమ్మ, నర్సింహాస్వామి, సమ్మక్క, పెద్దిరాజు, గిరిజావతి, అరబంతి పూబంతి, అరుణావతి, కరుణావతి, శ్రీవల్లి, భీమన్నపట్నాలు ఇలా 18వరకు కథలు చెబుతారు. ఇప్పటివరకు ఆదిలాబాద్ ఆకాశాణి రేడియతోపాటు వంద సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఒగ్గుడోలు ప్రదర్శనలు ఇస్తారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఒగ్గుకథను నేర్చుకోవడానికి కుటుంబీకులు, సమీప బంధువులు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసపత్రాలు, మెమొంటోలు అందుకున్నారు. శ్రావణమాసం, సట్టివారాలు, శివరాత్రి పట్నాలు, ఆలయాలు, చనిపోయిన ప్రాంతాల్లో, గంగ ప్రాంతాల్లో కళలను ప్రదర్శిస్తూ ఉపాధి పొందడంతోపాటు కళను చాటుతున్నారు.

భావితరాలకు అందిస్తా..



నేను చిన్ననాటి ఉంచే నా తండ్రి మల్లయ్య ద్వారా ఒగ్గు కథ నేర్చుకున్నాను. భావితరాలకు ఒగ్గు కథను నేర్పించడం నా లక్ష్యం. ఒగ్గు కథకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. మా కుటుంబీకులకు కళను నేర్పిస్తున్నాను.

– ఎగుర్ల రాములు, ఒగ్గు కథకుడు

ఒగ్గుకథపై మక్కువతో..



ఒగ్గుకథను చిన్నతనంలో చూసినప్పుడు ఎంతగానో నచ్చింది. మా బంధువు, గురువు రాములు వద్ద దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఒగ్గుకథ నేర్చుకుంటున్నా స్త్రీవేషంలో ప్రదర్శనలు ఇస్తున్న. మొదట్లో స్త్రీ వేషం వేయడం ఇబ్బందిగా అనిపించినా ఒగ్గుకథపై మక్కువతో ఉన్నతంతా రాణిస్తున్నాను.

– గుంటి దామోదర్(స్త్రీ వేషం), గ్రామం: బయ్యారం, మం:వేమనపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఎన్నో ఏళ్లుగా మా పూర్వీకుల నుంచి వస్తున్న ఒగ్గుకథను నమ్ముకుని.. ఒగ్గుకథ చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డోలు విన్యాసాలు చేస్తున్నాం. ఒగ్గుకథ కళాకారులను ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాం. – ఎగుర్ల కుమార్, బట్వాన్‌పల్లి


గోదావరిలో మునిగి యువకుడి మృతి

భైంసా: శివరాత్రి పర్వదినాన విషాదం చోటుచేసుకుంది. శనివారం బాసర గోదావరి నదిలో ఓ యువకుడు మృతిచెందాడు. మహారాష్ట్రలోని బిలోలి తాలూకా అజ్జే గ్రామానికి చెందిన ప్రదీప్(25) కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు రాగా, గోదావరి నదిలో స్నానానికి దిగాడు. దీంతో నీటి లోతు తెలియక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు.

బైక్ పైనుంచి పడి యువకుడు..

మామడ: బైక్‌పై నుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని శనివారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ వివరాల ప్రకారం... వాస్తాపూర్ గ్రామానికి చెందిన పెంద్రం అచ్యుత్‌రావ్(23) శుక్రవారం రాత్రి పంటచేనుకు కాపలగా ఉండేందుకు బైక్‌పై వెళ్లాడు. బైక్ అదుపు తప్పి గుంతలో పడి మృతిచెందాడు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని కార్మికుడు..


నాగభూషణ్ మృతదేహం

నేరడిగొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని నేరడిగొండకు చెందిన కార్మికుడు మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నాగభూషన్ (34) రోల్ మామడ టోల్ ప్లాజాలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. విషయం తెలుసుకున్న ఎస్సై సాయన్న సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బోథ్‌లోని మార్చురీకి తరలించారు.

వృద్ధుడి అదృశ్యం

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన బందెల నర్సయ్య అనే వృద్ధుడు ఈ నెల14న ఇంటి నుంచి ఉదయం 11గంటలకు బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. వివరాలకు సెల్: 87126 59947లో సంప్రదించాలని నర్సయ్య కుమారుడు లక్ష్మణ్ కోరారు.

బస్సును ఢీకొన్న ట్రాక్టర్

నేరడిగొండ: మండలంలోని ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని 44వ జాతీయ రహదారి బంధం క్రాసింగ్ వద్ద ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ అనిల్, బస్సులో ప్రయాణిస్తున్న ఇందిరమ్మ, రమేశ్‌లకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిర్మల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఐటీడీఏ ముట్టడిని జయప్రదం చేయండి

- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్


గ్రామాల్లో ప్రచారం చేస్తున్న తుడుందెబ్బ నేతలు

ఆదిలాబాద్‌రూరల్: ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ కోరారు. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకి బోయ, ఖాయితీ లంబాడతో పాటు మరో 11 కులాలను షెడ్యూల్ తెగల (ఎస్టీ) జాబితాలో చేరుస్తూ సీఎం కేసీఆర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని ఖండాల, పోతగూడ, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న 9 తెగల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేయకపోగ మరో 11 కులాలను ఎస్టీ జాబితా చేర్చడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి తొమ్మిది ఏళ్లు గడిచినప్పటికీ ఆదివాసీలకు సరైన విద్యా, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు అసలైన గిరిజన తెగలకు దక్కాల్సిన హక్కులను లంబాడీలు దోచుకుంటున్నారని విమర్శించారు. వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తాము ఉద్యమాలు చేస్తుంటే వారిని తొలగించకుండా ఓటు బ్యాంకు కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. సభ తీర్మానాన్ని వెనక్కి తీసుకోని రద్దు చేయకుంటే రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అలాగే ఆదివాసులు సాగుచేస్తున్న అటవీ భూములకు ఎటువంటి షరతులు, తీర్మానాలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, నాయకులు మరప రోహిదాస్, మెస్రం దినేష్, బి రాహుల్ ఉన్నారు.

బతుకు వేట..!




భైంసాటౌన్: కూటి కోసం కోటి విద్యలు అన్నారు పెద్దలు.. వీరిని చూస్తే అవుననే అనిపించకమానదు. భైంసా పట్టణంలో కొందరు మహిళలు ఇలా డ్రైయినేజీలో దేని కోసమో వెతుకుతున్నారు. ఇదేంటని వారిని ఆరా తీస్తే.. స్వర్ణకారులు పనిచేసే క్రమంలో చిన్నపాటి బంగారం ముక్కలు కిందపడతాయని, వాటి కోసమే మహారాష్ట్రలోని చంద్రాపూర్ నుంచి వచ్చి ఇలా వెతుకుతుంటామని, చాలాసార్లు దొరుకుతుందని చెప్పుకొచ్చారు.